బెల్లి యాదయ్యకు నాగదాసు స్మారక అవార్డు ప్రదానం చేస్తున్న కుటుంబీకులు,రచయితలు

సాహిత్య వికాసంలో తత్వకవులు కీలకం

నాగదాసు స్మారక సభలో డాక్టర్ నరేందర్ రాథోడ్

భీంపూర్, సెప్టెంబర్15: తరాలనుంచి ఆదిలాబాద్ జిల్లా సాహిత్యంలో మేటిగా ఉన్నదని సాహిత్య వికాసంలో ఉదారి నాగదాసు లాంటి తత్వకవుల పాత్ర కీలకమని వైద్య ఆరోగ్యశాఖ డీటీసీ (ప్రోగ్రాం ఆఫీసర్ ఇన్ డిస్ట్రిక్ట్ ట్రెయినింగ్ టీం) నరేందర్‌రాథోడ్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం రాత్రి .. తత్వ కవి ఉదారి నాగదాసు స్మారక అవార్డు ప్రదాన సభ నిర్వహించారు. నాగదాసు తత్వాల సీడీలు ఆవిష్కరించారు. అచలగురువు నాగదాసు చిత్రపటానికి పూలమాల సమర్పించారు. నల్లగొండకు చెందిన ప్రముఖ కవి , రచయిత బెల్లి యాదయ్యకు అవార్డుకింద రూ. 5 వేల నగదు,జ్ఞాపిక అందజేశారు. ఆయన రచనలను పరిచయం చేశారు. నేరెళ్ల రంగాచార్యులు అధ్యక్షతన నిర్వహించిన సభకు ముఖ్య అతిథులుగా హాజరైన నరేందర్‌రాథోడ్, పరిశోధకుడు, రచయిత విప్లవకుమార్ మాట్లాడుతూ తత్వ కవిగా నాగదాసు అందించిన సేవలను కొనియాడారు. 24 ఏళ్లుగా స్మారక సభలు నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులను అభినందించారు. ప్రకృతి విధ్వంసంపై నల్లగొండకు చెందిన ప్రముఖ వాగ్గేయకారుడు చింతల యాదగిరి గీతాలాపన అలరించింది. బేల విద్యార్థుల పాటలు అలరించాయి. నాగదాసు కుమారుడు ప్రముఖ కవి డాక్టర్ ఉదారి నారాయణ ఈ వేదిక ప్రాశస్త్యం వివరించారు.సాయిప్రియ, చరణ్‌దాస్ కవితలు ఆలోచింపజేశాయి. జిల్లాలో ఐతారం ముచ్చట్లు వేదిక కవులు కవితలు వినిపించారు. తాను నాగదాసు స్మారక సభ ద్వారానే గాయనిగా పరిచయమై ప్రభుత్వ తెలంగాణ సాంస్కృతిక సారథి విభాగంలో ఉద్యోగం పొందగలిగానని నర్సమ్మ అనే కళాకారిణి అన్నారు. వచ్చే ఏడాదినుంచి రూ. 5 వేల చొప్పున సాహితీ అవార్డులు ఇవ్వనున్నట్లు రిటైర్డ్ హెచ్ఎం నిశికాంత్ వెల్లడించారు. వివిధ ప్రాంతానుంచి వచ్చిన కవులు కవితలు వినిపించారు. కార్యక్రమంలో ప్రముఖ రచయితలు వసంత్‌రావు దేశ్‌పాండే , సామల రాజవర్ధన్,రాడారపు సంతోష్, వేణుగోపాల్‌రెడ్డి , కవులు చరణ్‌దాస్, బాబన్న , లక్ష్మీనారాయణ,రిజ్వాన్, సాయిప్రియ , శైలజ,కబీర్‌దాస్, పడకంటి కిష్టయ్య,వీరన్న, ఉదారి శేషన్నపంతులు, నారాయణ, కృష్ణమాచార్యులు,రమేశ్, దయానంద్ శ్రీనివాస్, కవీశ్వరాచారి తదితరులున్నారు. నాగదాసు రచించిన తత్వాలను మల్లెల కబీర్‌దాస్ బృందం పాడి అలరించారు.

గొర్రెల కాపరి నుంచి సాహితీవేత్త వరకు

సామాన్య రైతుకుటుంబానికి చెందిన యాదయ్య గొర్రెల కాపరిగా జీవనయానం ప్రారంభించి అనేక ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటూ ఉన్నత చదువులు పూర్తిచేసి గెజిటెడ్ అధ్యాపకుడిగా నిలబడగలిగారని ఆదిలాబాద్ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు, రచయిత రడారపు సంతోష్‌కుమార్ అన్నారు. గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, నాగదాసు అవార్డు గ్రహీత అయిన బెల్లి యాదయ్యను ఆయన సహచర అధ్యాపకులతో కలిసి ఆదిలాబాద్ జడ్పీ సమావేశ మందిరంలో శాలువాలతో సన్మానించారు.

మొసలి పట్టివేత

లక్ష్మణచాంద, సెప్టెంబర్ 15 : మల్లాపూర్ లోని ఊరచెరువులో ఆదివారం అటవీ శాఖ అధికారులు మొసలిని పట్టుకున్నారు. చెరువులో మొసలిని గమనించిన స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన అధికారులు చెరువులోని మొసలిని పట్టుకుని గోదావరిలో వదిలిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వోడీ శ్రీనివాస్, ఎఫ్‌బీవో అంజయ్య పాల్గొన్నారు.

పట్టుకున్న మొసలితో అటవీ శాఖ అధికారులు

ట్రాక్టర్‌తో తరలించిన బండరాళ్లు

కోతకు గురైన చోట బండరాళ్లు వేస్తున్న గిరిజనులు

ఊరంతా కదిలారు.. రోడ్డును బాగు చేసుకున్నారు

బోథ్, సెప్టెంబర్ 15 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతకు గురైన రోడ్డు కోసం ఊరంతా కదిలారు. ఎవరో వచ్చి బాగు చేస్తారని చూడకుండా నడుం కట్టి మరమ్మతులు చేసుకున్నారు. బోథ్ మండలంలోని చింతగూడ జీపీ పరిధిలోని నేరెడుపల్లె గ్రామానికి ఉన్న ఫార్మేషన్ రోడ్డు భారీ వర్షాలకు కోతకు గురైంది.గూడ నుంచి నేరెడుపల్లె వరకు ఉన్న రోడ్డు చెడిపోవడంతో ద్విచక్రవాహనాలు సైతం నడవడానికి వీలు లేకుండా తయారైంది. రాకపోకలకు ఇబ్బందులు ఎదురవడంతో గిరిజనులు మూడు రోజులుగా ట్రాక్టర్ ద్వారా బండరాళ్లను తీసుకొచ్చి శ్రమదానంతో కోతకు గురైన చోట రాళ్లను వేశారు. ఒకటి, రెండు రోజుల్లో మట్టి మొరం తీసుకొచ్చి బండరాళ్లపై వేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గ్రామ పటేల్ ఆత్రం జంగు, దేవరి మడావి ప్రభు, మహాజన్ సిడాం రాము ఆధ్వర్యంలో రోడ్డును బాగు చేసుకున్నారు.

సంప్రదాయ దుస్తుల్లో మహిళలు

సంప్రదాయాలను కాపాడుకోవాలి

ఉట్నూర్, సెప్టెంబర్ 15 : గిరిజన సంప్రదాయాలను కాపాడుకోవాలని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలోని లక్కీషా బంజారా కాలనీలో వినాయకుని పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన బంజారా మహిళలు సంప్రదాయ దుస్తులలో పీవోకు ఆహ్వానం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నేటి తరానికి మన సంప్రదాయాలు నేర్పాల్సిన బాధ్యత పెద్దలపై ఉందన్నారు. భక్తిమార్గం, విద్య, సంస్కృతీసంప్రదాయాల రక్షణ మన బాధ్యత అన్నారు. మహిళలు పిల్లల చదువుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాథోడ్ భీంరావు, కృష్ణ, రవి, ఉత్తం, రవి, ధన్‌లాల్, అమృత్‌లాల్, రాజ్‌కుమార్, ధన్‌సింగ్, సురేశ్, శ్రీకాంత్, కాంతారావు, విజయ్, బాలాజీ, కైలాస్, దేవివాస్, విఠల్, విష్ణు, చరణ్‌సింగ్, దత్తారాం పాల్గొన్నారు.

రిజర్వేషన్ల కోసం ఐక్యంగా పోరాడాలి

ఎదులాపురం,సెప్టెంబర్15 : శాసించే స్థాయి నుంచి రెడ్డిలు యాచించే స్థాయికి వచ్చారని, రిజర్వేషన్ల సాధన కోసం ఐక్యంగా ఉంటూ సాధించుకునేలా కార్యక్రమాలు చేపడుతున్నామని రెడ్డి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గోపిడి రాంరెడ్డి అన్నారు. గణేశ్ నవరాత్రులను పురస్కరించుకొని ఆయా రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న రెడ్డి కులస్తులను అధ్యక్షుడు నల్ల నారాయణ రెడ్డితో కలిసి సత్కరించారు. అనంతరం వారు ఏ రంగంలో సేవలు అందిస్తున్నారో తెలియజేస్తూ మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గోపిడి రాంరెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు రెడ్డిలు శాసించే వారని, ఇప్పుడు తమ హక్కులను అడుక్కునే పరిస్థితి నెలకొందన్నారు. పది రిజర్వేషన్ కోసం ఉద్యమాలు చేయడంతో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. కలిసి కట్టుగా ప్రభుత్వంపై పోరాడి సాధించుకోవాలన్నారు. ఐక్యతను పెంచడంలో భాగంగానే అనుబంధ సంఘాలను మమేకం చేసేలా కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. రిజర్వేషన్లు వస్తే విద్య, ఉద్యోగ ఉపాధి అవకాశాలు పిల్లలకు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బోజ్జుపటేల్

ఇంద్రవెల్లి, సెప్టెంబర్15 : గ్రామీణ ప్రాంతంలోని గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని మెండపల్లి, పిప్రి, ధనోరా(బీ), దేవాపూర్, తేజాపూర్, సాలేగూడ, గౌరాపూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామాల్లోని సమస్యలను ప్రజలు విన్నవించారు. ఇటీవల అడవి పందిదాడిలో మృతి చెందిన సిర్‌సట్ హనుమాన్ కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వ పరంగా చెల్లించే నష్ట పరిహారం అందించి అన్ని విధాలుగా అదుకుంటామని ఎమ్మెల్యే భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముకాడే ఉత్తం, పట్టణ అధ్యక్షుడు ఎండీ జహీర్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ మసూద్, తదితరులు పాల్గొన్నారు.

హిందీ భాషాభివృద్ధికి శివరాం కృషి

వైద్య ఆరోగ్య శాఖ డీటీసీ నరేందర్ రాథోడ్

ఎదులాపురం, సెప్టెంబర్ 15 : హిందీ భాషాభివృద్ధికి పట్టణానికి చెందిన గుజరాతీ శివరాం విశేషంగా కృషి చేశారని వైద్య ఆరోగ్య శాఖ డీటీసీ నరేందర్ రాథోడ్ తెలిపారు. హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని శివరాం సంస్మరణ సభను నిర్వహించారు. హిందీ భాషాభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులు, ప్రముఖులను సత్కరించారు. ఈ సందర్భంగా నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ గుజరాతీ శివరాం ఎంతో మంది హిందీ ఉపాధ్యాయులను తయారు చేశారని, ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా హిందీ ప్రతిష్టకు ప్రచార్ అవార్డును అందుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సోమయ్య, మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే, ఖత్రి సమాజ్ అధ్యక్షుడు ఆదిత్య ఖండేష్కర్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, గౌరవాధ్యక్షుడు బండారి వామన్, గుజరాతి శివరాం శిష్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

బోథ్, సెప్టెంబర్ 15 : మండలంలోని సొనాల రామలయంలో హిందూ ధర్మ జాగరణ ఆధ్వర్యంలో ఇటీవల విద్యార్థులకు ఆధ్యాత్మిక పరీక్ష నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ జాగరణ మండలి సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కుంటాల, సెప్టెంబర్, 15: కల్లూరు ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కల్లూరులో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు టీ. జంగయ్య, సీ. లక్ష్మణ్, రాజశ్రీను సన్మానించారు. వారు చేసిన సేవలు గుర్తించి ప్రభుత్వం అవార్డు ఇవ్వడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ముత్యం, సుధాకర్, వెంగల్‌రావు, బీ. నవీన్, జీ. నవీన్, ప్రదీప్, సాయినాథ్, సంధ్యారాణి, సారిక తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

తనయుడి చేతిలో తండ్రి హతం

ఉట్నూర్ రూరల్, సెప్టెంబర్ 15: తనయుడి చేతిలో తండ్రి హతమైన సంఘటన ఉట్నూర్ మండలంలోని రాజన్న గూడెంలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్ఐ మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం ఆస్తి పంపకాల విషయంలో తండ్రి భూమన్నపై కుమారుడు భాగ్యవాన్ దాడి చేస్తూ ఉండేవాడు. నెల కిందట పంపకాల విషయంలో భాగ్యవాన్ దాడి చేయగా పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది. మూడు రోజుల క్రితం తండికన భూమన్న(65)పై కుమారుడు భాగ్యవాన్ ఇనుప రాడ్డుతో దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. తండ్రి భూమన్నకు రిమ్స్ దవాఖానకు తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ భూమన్న మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మనోహర్ తెలిపారు.

రేపటి నుంచి 'స్వచ్ఛతా హీ సేవ'

కుంటాల, సెప్టెంబర్ 15: ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛత హీ సేవా -2024 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లింబాద్రి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మండల వ్యాప్తంగా పారిశుధ్య పనులు చేపట్టడం, ప్రజలకు శుభ్రతపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

బంగారమే శ్రీరామరక్ష!

ఆపత్కాలంలో ఆదుకునేది బంగారం మాత్రమే. సమయానికి చేతిలో చిల్లిగవ్వ లేనప్పుడు ఈ పుత్తడే మీకు పరమాన్నంగా మారుతున్నది. ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రి పాలైనప్పుడు ఈ గోల్డే మీకు ఆర్థికంగా ఆదుకుంటుంది. ఆర్థిక సంక్షోభం చుట్టుముట్టినప్పుడు బంగారమే శ్రీరామరక్ష. సామాన్యుడి నుంచి మొదలుకొని సంపన్నవర్గాలు కూడా ప్రతియేటా బంగారం ఎంతోకొంత కొనుగోలు చేస్తున్నారు. అక్కరకు వచ్చినప్పుడు ఈ గోల్డ్‌ను తాకట్టుపెట్టుకొని రుణాలు తీసుకుంటున్నారు. వీటికోసం బ్యాంకులతోపాటు ఆర్థిక సేవల సంస్థలు ప్రత్యేకంగా పసిడిపై రుణాలు మంజూరు చేస్తున్నాయి. సెక్యూర్డ్ రుణాలు కావడంతో బంగారం విలువలో 80 శాతం వరకు రుణాలు మంజూరు చేస్తున్నాయి బ్యాంకులు, ఆర్థిక సేవల సంస్థలు. బంగారం కడ్డీలతోపాటు ఆభరణాలు తాకట్టుపెట్టుకొని కేవలం కొన్ని నిమిషాల్లోనే రుణం పొందవచ్చును. వ్యక్తిగత రుణాలు, ఇతర రుణాలు తీసుకోవాలంటే రోజుల సమయం పడుతుంది కానీ, బంగారంపై రుణాలు తీసుకోవడం ఎంతో సులభం. పెద్దగా డాక్యుమెంట్లు లేకుండానే తీసుకోవచ్చును. తక్కువ వడ్డీకే రుణాలు తీసుకోవచ్చును. ఏయే బ్యాంకుల్లో ఎంత వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి. ప్రభుత్వరంగ బ్యాంకులతో పాటు ప్రైవేట్ రంగ బ్యాంకులు 8 శాతం మొదలు కొని 24 శాతం వరకు వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి. తీసుకున్న రుణాలను ఏడాదిలోగా చెల్లించాల్సి ఉంటుంది. లేకపోతే బ్యాంకులు తాకట్టుకింద పెట్టిన ఆభరణాలను జప్తు చేసుకొని వేలం వేసుకునే అధికారం ఉంటుంది. పసిడి విలువను గుర్తించడంలో ఒక్కో బ్యాంకుది ఒక్కో తీరుగా ఉంటుంది.

పసిడి రుణాలపై ఏయే బ్యాంకుల్లో ఎంత వడ్డీ

బ్యాంక్	వడ్డీరేటు(శాతంలో)	ప్రాసెసింగ్ ఫీజు
కొటక్ మహీంద్రా	8 నుంచి 24 వరకు	2 శాతం+జీఎస్టీ
హెచ్‌డీఎఫ్‌సీ	8.30 నుంచి 16.55 వరకు	ఒక్క శాతం
సెంట్రల్ బ్యాంక్	8.40 నుంచి 9.25 వరకు	రుణంపై అరశాతం
యూకో	8.50	రూ.250-5 వేల వరకు
ఇండియన్ బ్యాంక్	8.80 నుంచి 9 వరకు	రుణంపై 0.56 శాతం
యూనియన్ బ్యాంక్	8.65 నుంచి 9.90 వరకు	-
ఎస్బీఐ	8.70	అర శాతం+జీఎస్టీ
ఇండస్‌ఇండ్	8.75 నుంచి 16 వరకు	రుణంపై ఒక్క శాతం
బంధన్ బ్యాంక్	8.75 నుంచి 19.25 వరకు	ఒక్క శాతం+జీఎస్టీ
బ్యాంక్ ఆఫ్ బరోడా	9.15	వర్తించే చార్జిలు+జీఎస్టీ
పంజాబ్ నేషనల్	9.25	రుణంపై 0.75 శాతం
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర	9.30	రూ.500-2,000+జీఎస్టీ
ఫెడరల్ బ్యాంక్	9.49	-
కెనరా బ్యాంక్	9.60	రూ.500-5 వేల వరకు
ఐసీఐసీఐ బ్యాంక్	10	రుణంపై ఒక్క శాతం

క్రెడిట్ స్కోర్ అక్కర్లేదు..

సిబిల్ స్కోర్ లేకుండానే బంగారంపై రుణాలు తీసుకోవచ్చును. కేవలం బంగారం లేదా ఆభరణాలు తాకట్టు పెట్టుకొని రుణాలు తీసుకోవచ్చును. దీనికోసం వారి క్రెడిట్ స్కోర్ ఎంత ఉన్నదో అవసరం లేదు. 500 లోపు సిబిలి స్కోర్ ఉన్నవారు కూడా సులువుగా రుణాలు తీసుకోవచ్చును.

కావాల్సిన డాక్యుమెంట్లు

బంగారం తాకట్టుపై రుణాలు తీసుకోవడానికి పలు డాక్యుమెంట్లు అవసరం ఉంటాయి. వీటిలో ఆధార్ కార్డుతోపాటు పాన్ కార్డు, బ్యాంక్ ఖాతాతోపాటు కేవైసీ డాక్యుమెంట్ సమర్పించాల్సి ఉంటుంది. మనం తీసుకునే బ్యాంకులోనే ఖాతా ఉండాల్సి ఉంటుంది. ఇటీవలకాలంలో బ్యాంకులతోపాటు పసిడిపై రుణాలు ఎన్‌బీఎఫ్‌సీలు కూడా ఇస్తున్నాయి.

తిరిగి చెల్లింపులు ఎలా..

బంగారంపై తాకట్టుపై రుణాలు తీసుకున్న వారు మూడు రకాలుగా తిరిగి చెల్లింపులు జరుపుకునే అవకాశాలను బ్యాంకులు కల్పించాయి. వీటిలో నెలవారి చెల్లింపుల రూపంలో చెల్లింపులు జరుపుకోవచ్చును, లేదా మూడు నెలల్లో వడ్డీతో సహా తీసుకున్న రుణాన్ని చెల్లించవచ్చును. అలాగే ఆరు నెలలు, ఏడాది కాల పరిమితితో తీసుకున్న రుణాలను వడ్డీతో కలుపుకొని చెల్లించుకోవచ్చును. ఒకవేళ ఏడాది ముగిసిన తర్వాత తీసుకున్న రుణానికి వడ్డీని చెల్లించి మళ్లీ రెన్యూవల్ చేసుకోవచ్చు.

కొత్త పీపీఎఫ్ రూల్స్

అక్టోబర్ 1 నుంచి అమల్లోకి..

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) ఖాతాలను మైనర్ల కోసం కూడా తెరుచుకోవచ్చు. మారిన నిబంధనల ప్రకారం సదరు మైనర్లకు 18 ఏండ్లు నిండేదాకా ఈ ఖాతాలు పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ వడ్డీ రేటుతో కొనసాగుతాయి. మైనార్టీ తీరిన తర్వాత పీపీఎఫ్ ఖాతాగా మార్చుకోవచ్చు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇక ఒకటికి మించి పీపీఎఫ్ ఖాతాలనూ తెరుచుకోవచ్చు. అలాగే ప్రవాస భారతీయులు (ఎన్నారైలు) పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ స్కీం (పీపీఎఫ్) 1968 కింద క్రియాశీల పీపీఎఫ్ ఖాతాలను తెరిస్తే ఫామ్ హెచ్ ద్వారా ఖాతాదారుని నివాస హోదా గురించి అడగకపోతే పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ మార్గదర్శకాల ప్రకారం ఈ నెలాఖరుదాకా ఉండే వడ్డీరేట్లు వర్తిస్తాయి. పీపీఎఫ్ అనేది కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సాధనం. అంతేగాక మదుపరులను దీర్ఘకాలిక ఆకర్షణీయ ప్రయోజనాలతో కూడిన సేవింగ్స్, పెట్టుబడులకు ప్రోత్సహించే పథకం ఇది. దీనికి ఆదాయ పన్ను (ఐటీ) మినహాయింపులూ వర్తిస్తాయి.

షార్ట్-టర్మ్ ఆరోగ్య బీమా

లాభాలు, పరిమితులు తెలుసా?

షార్ట్-టర్మ్ ఆరోగ్య బీమా తాత్కాలిక కవరేజీని కల్పిస్తుంది. దీన్నే టర్మ్ మెడికల్ ఇన్సూరెన్స్ అని కూడా పిలుస్తారు. సాధారణంగా ఇది కొద్ది నెలల నుంచి ఏడాదిదాకే ఉంటుంది. ఎవరైతే స్టాండర్డ్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలతో వచ్చే దీర్ఘకాలిక ఆరోగ్య బీమాలు కాకుండా తక్షణ కవరేజీలను కోరుకుంటారో వారినుద్దేశించినదే ఈ పాలసీ. సమగ్ర కవరేజీని కొనలేనివారికి కూడా ఇది ఉపయుక్తంగా ఉంటుంది. కంపెనీల్లో గ్రూప్ ఇన్సూరెన్స్ కోసం వేచిచూస్తున్న ఉద్యోగులు, నిరుద్యోగులకు దీని అవసరం ఎక్కువని చెప్పవచ్చు.

షార్ట్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్ శైలి

- కేవలం కొద్ది నెలల నుంచి ఏడాది వరకే బీమా కవరేజీ.
- లాంగ్-టర్మ్ ప్లాన్లతో పోల్చితే షార్ట్-టర్మ్ ప్లాన్లకు ప్రీమియంలు తక్కువే.
- ఇప్పటికే ఉన్న ఆరోగ్య సమస్యలకు బీమా కవరేజీ ఉండకపోవచ్చు. కొన్ని రకాల చికిత్సలకూ వీలుండదు.
- కనీస ఆరోగ్య సమాచారంతో ఈ ప్లాన్లను తీసుకోవచ్చు.
- పరిమిత స్థాయిలోనే ఈ ప్లాన్ల చెల్లుబాటు ఉంటుంది. ఎంపిక చేసిన నెట్‌వర్క్‌లో తప్ప.. అన్ని దవాఖానల్లో చెల్లవు.
- లాంగ్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలను రెన్యువల్ చేసుకున్నట్టుగా ఈ షార్ట్-టర్మ్ పాలసీలను రెన్యువల్ చేసుకోలేం.

చివరగా..

షార్ట్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్‌లు తక్షణ అవసరాలకే పనికొస్తాయి. కాబట్టి లాంగ్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్‌లకే ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడే దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలను పొందుతాం. ప్రీమియంలు ఎక్కువైనప్పటికీ క్లెయిములు లేకపోతే కవరేజీలు పెరిగే ప్రయోజనం ఉంటుంది. మెటర్నిటీ, మెంటల్ హెల్త్ తదితర అవసరాలు, సమస్యలకూ స్టాండర్డ్ హెల్త్ ఇన్సూరెన్స్‌లే లాభదాయకం అని స్పష్టంగా చెప్పవచ్చు. అందుకే సమగ్ర ప్యాకేజీని తీసుకోవడం మరువద్దు.

రాబడి

ఫెడ్ నిర్ణయమే కీలకం..

దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల జోష్‌లో సాగుతున్నాయి. మదుపరులు పెట్టుబడులకు మద్దతు పలుకుతున్నారు. గత వారం ట్రేడింగ్‌లో గురువారం ఒక్కరోజే సెన్సెక్స్ 1,440, నిఫ్టీ 470 పాయింట్లు పెరిగాయి. ఈ క్రమంలోనే వారం మొత్తంగా సూచీలు భారీ ఎత్తున పుంజుకోగలిగాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,707.01 పాయింట్లు ఎగిసి 82,890.94 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 504.35 పాయింట్లు ఎగబాకి 25,356.50 దగ్గర ముగిసింది. మునుపెన్నడూ లేనివిధంగా సెన్సెక్స్ తొలిసారి 83వేల మార్కును అధిగమించింది. నిఫ్టీ సైతం నూతన గరిష్ఠాలను తాకింది. ఈ నేపథ్యంలో ఈ వారం అమ్మకాల ఒత్తిడికి ఆస్కారం కనిపిస్తున్నది. శుక్రవారమే మార్కెట్లలో సెల్లింగ్ ప్రెషర్ ఉండటాన్ని గమనించవచ్చు. పారిశ్రామికోత్పత్తి మందగించడం, ద్రవ్యోల్బణం మళ్లీ విజృంభిస్తున్న సంకేతాలు రావడంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు బ్రేక్ వేయవచ్చన్న అభిప్రాయాలను మెజారిటీ నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. పైగా సూచీలు ఆల్‌టైమ్ హైల్లో ఉండటం కూడా లాభాల స్వీకరణకు తావిస్తోందంటున్నారు. ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య సమీక్ష ప్రభావం కూడా కనిపించనున్నది. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,900 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,700 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,700-25,900 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

చివరగా..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఏ బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

యూబీఐ ప్రత్యేక డిపాజిట్ స్కీం

ప్రభుత్వ రంగ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిట్లను ఆకట్టుకోవడానికి ప్రత్యేక డిపాజిట్ స్కీంను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. 333 రోజుల కాలపరిమితితో యూనియన్ సమృద్ధి స్కీంపై అధిక వడ్డీరేటును ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. ఈ స్కీంలో కనీసంగా రూ.1,000 నుంచి రూ.3 కోట్ల లోపు డిపాజిట్ చేయవచ్చును. ఈ స్కీంపై సాధారణ ప్రజలకు 7.40 శాతం వార్షిక వడ్డీని చెల్లిస్తున్న బ్యాంక్..సీనియర్ సిటిజన్లకు 7.90 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 8.15 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. మెచ్యూర్ కాకముందే ఈ డిపాజిట్లను విత్‌డ్రా చేసుకునే అవకాశాన్ని బ్యాంక్ కల్పించింది. కానీ, ఇలా చేసుకుంటే ఒక్క శాతం వడ్డీని తగ్గి చెల్లించనున్నది. ఈ డిపాజిట్ స్కీంను ఎంచుకోవడానికి బ్యాంక్ శాఖ లేదా వెబ్‌సైట్ ద్వారా డిపాజిట్ చేయవచ్చును.